# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నాలెడ్జి ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి అమరావతి కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.
- ❖ టెక్కలి సమీపంలో ఈరోజు జరిగిన రైలు ప్రమాదంపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
- ❖ బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం ఈరోజు రాత్రి విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

==========================

శరవేగంగా నిర్మితమవుతోన్న రాజధాని అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లాంటి సంస్థ రావటం గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఈరోజు భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... మొత్తం 12 ఎకరాల్లో ఏటా 3 లక్షల మందికి చికిత్స అందించేలా ఈ సంస్థ ఏర్పాటు అవుతోందని తెలిపారు. కంటి చికిత్సలకే పరిమితం కాకుండా పరిశోధన, శిక్షణ లాంటి కార్యక్రమాలను కూడా అందించేలా ఇక్కడ నిర్మాణం చేపట్టటం ఎంతో సంతోషదాయకమన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ నేత్రవైద్య పరిశోధనా సంస్థగా అమరావతిలోని కేంద్రాన్ని నిలపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. నాలెడ్జి ఎకానమీకి, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధి కేంద్రంగా అమరావతి తయారవుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

========================

ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలోని ఆ శాఖ అధికారులతో మంత్రి ఈరోజు కీలక సమావేశం నిర్వహించి.. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ నెల 27న పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయాల ని, రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ తరఫున చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు సరికొత్త ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సౌందర్యాన్ని తెలిసేలా దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్ షోలు నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

========================

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస సమీపంలో ఈరోజు రైలు ప్రమాదం చోటు చేసుకుంది. రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఐదుగురిని ఢీకొట్టిన ఘటనలో నలుగురు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే ట్రాక్‌పై నడిచి వెళ్తుండగా వారిని రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రునకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు.

========================

వాయువ్య బంగాళాఖాతంపై కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాంధ్రలో ఈరోజు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలూ ఒకటి, రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు సంభవించే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 50 నుంచి 60 గరిష్టంగా 70 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందని పేర్కొంది.
కాగా పశ్చిమమధ్య, వాయువ్య బంగాళాఖాతంలో వేగంగా కదులుతున్న తీవ్రవాయుగుండం ఈరోజు రాత్రికి విశాఖపట్నం - గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు కూరుస్తాయని హెచ్చరించింది. ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు.

========================

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో ఈరోజు అధికారులతో సమీక్ష చేపట్టారు. వాయుగుండం తీరం దాటే సమయంలో గాలుల వేగం గంటకు 85 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని వివరించిన అధికారులు.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రేపు, ఎల్లుండి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆకస్మిక వరదలు, భారీ వర్షాలకు అవకాశం ఉండే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరవై అయిదేళ్ల ప్రజా సేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం `సేవా సంకల్ప్ అభియాన్` పేరిట ప్రత్యేక కధనాలను అందిస్తోంది. అందులో భాగంగా `వోకల్ ఫర్ లోకల్` గురించి ఇప్పుడు తెలుసుకుందాం!.

దేశంలో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం `వోకల్ ఫర్ లోకల్`కు పిలుపునిచ్చింది. ప్రజలలో ఆత్మనిర్భరతా స్ఫూర్తిని ప్రోత్సహించి, వారిని సుస్థిర వృద్ధి, శ్రేయస్సు వైపు నడిపించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం. ఇది స్థానికంగా ఉన్న చేతివృత్తుల వారు, చిన్న వ్యాపారులు, తయారీదారులను ప్రోత్సహించడం ద్వారా స్థానిక ఉత్పత్తులకు గిరాకీ పెరిగి.. గ్రామీణ, కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెంది తద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యం. అలాగే విదేశీ వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించి.. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో `వోకల్ ఫర్ లోకల్` ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఈ కార్యక్రమం కింద దేశంలో వస్తువుల ఉత్పత్తితో పాటు, స్థానిక బ్రాండ్లు, తయారీ, సరఫరా గొలుసును ప్రోత్సహించాలని ప్రభుత్వం పేర్కొంది. జీవనోపాధి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్థానిక కుటీర పరిశ్రమలదారులు, చేతివృత్తులు, హస్తకళాకారులను బలోపేతం చేయాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వోకల్ ఫర్ లోకల్'ని ప్రోత్సహించాలని ఒక సందర్భంలో పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

వికసిత్ భారత్ నిర్మాణంలో మహిళలు, భావి భారత పౌరుల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు అన్నారు. జాతీయ పోషణ్ మాసోత్సవాలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న `పోషణ్ అభియాన్ ఫోటో ఎగ్జిబిషన్`ను ఆయన ఈరోజు సందర్శించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఈ రెండు రోజుల సమాచార, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, శిశువులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

(వాయిస్ 25 సెకన్లు)

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ చంద్ర తెలియజేస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సేవలను వివరిస్తూ.. రూపొందించిన 'సేవా సంకల్ప్ అభియాన్' ప్రచురణలను సోము వీర్రాజు సందర్శించారు.

========================

గతంలో ఎవరూ చేయని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని మాజీ ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలకు ధీటుగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రేటర్ విశాఖ వైసీపీ నేతలతో జగన్మోహన్ రెడ్డి ఈరోజు సమావేశమయ్యారు.

========================
========================